క్లుప్తంగా

రక్తదాతకు కలెక్టర్ ప్రశంస



కలెక్టర్ శరత్ నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న చంద్రశేఖర్

నారాయణఖేడ్/సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం పసల్వాది శివారు శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో విద్యాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం కలెక్టర్ శరత్ ప్రారంభించారు. శిబిరంలో సామాజిక కార్యకర్త వోతె చంద్రశేఖర్ 42వ సారి రక్తదానం చేశారు. 20 ఏళ్లుగా రక్తదానంతో పాటు ప్లాస్మాను దానం చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ సిద్ధాంతి, శాంత డెవలపర్స్ యజమాని దారం సంజయ్‌లు చంద్రశేఖర్‌ను అభినందించారు. విషయాన్ని జిల్లా కలెక్టర్ డా.శరత్‌కు వివరించగా, ఆయన చంద్రశేఖర్‌కు ప్రశంస పత్రం అందించారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులతో విజయకుమార్

హత్నూర(సంగారెడ్డి): ఆత్మ రక్షణకు కరాటే అవసరమని కరాటే మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం దౌల్తాబాద్‌లో కుంపు బెల్ట్ టెస్ట్ పరీక్షను నిర్వహించారు. మండలంలోని కొన్యాల్, మాదూర, దౌల్తాబాద్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి బెల్ట్స్ అండ్ సర్టిఫికెట్స్ అందుకున్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్స్ ప్రవీణ్, యాదుల్, ప్రశాంత్ అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్లు దాసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

నారాయణఖేడ్: ఖేడ్ ప్రభుత్వ పాఠశాల 1983– 84లో పదో తరగతి విద్యార్థుల ఖేడ్ మిత్ర సోషల్ సర్వీస్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వివేకానంద పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యారం, చెస్, షటిల్ కోర్టులో షటిల్ సింగిల్స్, డబుల్స్ పోటీలను నిర్వహించారు. ఆయా విభాగాల్లో 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అసోసియేషన్ బాధ్యులు కోటగిరి సత్యనారాయణ, వివేకాంద్, సంగారెడ్డి, వెంకటేశం, ప్రభాకర్, మన్సూర్, రమేష్, లక్ష్మణ్, సుధాకర్, నాగయ్య, సతీష్, శ్రీశైలం పర్యవేక్షించారు.

నగర సంకీర్తన



భజన చేస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఆదివారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు తెల్లవారు జామున వీధుల్లో తిరుగుతూ భగవంతుడి నామస్మరణ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు, డాక్టర్లు, వ్యాపారులు, సామాన్య ప్రజలతో పాటు మహిళలు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కౌన్సిలర్ అండ



దుర్గమ్మకు దుస్తులు అందజేస్తున్న కౌన్సిలర్, నాయకులు

నారాయణఖేడ్: నా అనేవారు లేక అనాథగా మారిన ఓ వృద్ధురాలికి వార్డు కౌన్సిలర్ అండగా నిలిచారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేట్ 2వ వార్డుకు చెందిన వృద్ధురాలు పుట్టి దుర్గమ్మకు సంతానం, బంధువులు ఎవరూ లేకపోవడంతో అనాథగా మారింది. కొద్ది రోజులుగా ఎవరైనా భోజనం పెడితే తిని, ఆలయం వద్ద పడుకుంటూ దుర్భర జీవనం గడుపుతోంది. ఆమె దయనీయ స్థితిని తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ స్వప్న సొంత ఖర్చులతో వృద్ధురాలు ఉండేందుకు రేకుల షెడ్ నిర్మించారు. ఆదివారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు రోషన్‌రెడ్డి చేతులమీదుగా షెడ్‌ను ప్రారంభించి దుర్గమ్మకు అవసరమైన దుస్తులను అందించారు.

సర్కారు బడి.. సమస్యల ఒడి

- అధ్వానంగా మరుగుదొడ్లు.. నిర్వహణ లేక దుర్వాసన
- ఒకటికి, రెంటికి బయటకే..
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- ఇదీ.. భెల్ జెడ్పీహెచ్‌ఎస్ దుస్థితి



బీహెచ్ఈఎల్ జిల్లా పరిషత్ పాఠశాల

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఉమ్మడి జిల్లాలో ఓ వెలుగు వెలిగిన బీహెచ్‌ఈఎల్ జెడ్పీహెచ్ పాఠశాల నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సంబంధిత అధికారులు సమస్యలపై స్పందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. 1975లో బీహెచ్‌ఈఎల్ సంస్థ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయిలో జిల్లా పరిషత్ పాఠశాల భవనాన్ని నిర్మించింది. ఇంత కాలం పాఠశాల బాగోగులను చూసిన భెల్ యాజమాన్యం ప్రస్తుతం బడి నిర్వహణను పట్టించుకోవడంలేదు. దీంతో పాఠశాలలో కనీస వసతులకు నోచులేక విద్యార్థులు నానా ఇక్కట్లు పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు సరిగా లేక విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఒకే గదిలో 60 మంది విద్యార్థులు

జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు ప్రాథమిక పాఠశాల కూడా ఇదే భవనంలో కొనసాగుతోంది. జెడ్పీహెచ్‌ఎస్‌లో 685 మంది విద్యార్థులు ఉండగా, ప్రాథమిక పాఠశాలలో 239 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల భవనంలోనే ప్రభుత్వ హాస్టల్ కూడా ఉండడంతో తరగతి గదులకు కొరత ఏర్పడింది. ఒక్కొక్క తరగతిలో 50 నుంచి 60 మంది విద్యార్థులను ఉంచి విద్యాబోధన చేస్తున్నారు. గదుల సమస్య పరిష్కారానికి హాస్టల్‌ను వేరే చోటుకు తరలించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

దుర్వాసనతో ఇక్కట్లు..

విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ బాబు దాతల సాయంతో మరుగుదొడ్లను నిర్మించారు. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లి విద్యార్థులు వినియోగించలేని పరిస్థితి నెలకొంది. హాస్టల్ విద్యార్థులు బహిరంగ మలవిసర్జన చేస్తుండడంతో పాఠశాల పరిసరాలు దుర్గంధంతో నిండిపోతోంది. తరగతి గదిలో కూర్చొని పాఠాలు వినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండడంతో బాలికలు వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతులు చేసి, పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



తరగతి గది పక్కనే పారుతున్న మురుగునీరు



అపరిశుభ్రంగా మరుగుదొడ్లు

కనుల పండువగా మల్లికార్జున స్వామి జాతర



మల్లికార్జున స్వామిని దర్శించుకున్న కార్పొరేటర్లు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ ఆల్విన్ కాలనీలో భ్రమరాంబ కేతకి, రేణుక ఎల్లమ్మ సమేత మల్లికార్జున స్వామివారి జాతర ఆదివారం కనుల పండువగా సాగింది. జాతరలో కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నాగేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మల్లేశ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, రాజు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ శివారు మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం జాతర వైభవంగా ప్రారంభమైంది. మండల పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్పానగేష్, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేష్, గొర్రె కాపరుల సంఘం మాజీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ పెద్దగొల్ల నాగేష్ స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు రాములు, రవి, కృష్ణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు దైవ చింతన కలిగి ఉండాలి



గ్రామంలో పర్యటిస్తున్న స్వామి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికత కలిగి ఉండాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి సూచించారు. గుమ్మడిదల మండలం అనంతారం గ్రామంలో ఆదివారం యశస్సు కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. భగవంతుని ధ్యానంతో మంచి జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో సర్పంచ్ దీపా, నాయకులు, ప్రజాప్రతినిధులు, స్వామి భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



సాయం అందిస్తున్న రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని బ్రాహ్మణగూడ గ్రామంలో ఇటీవల విద్యుదాఘాతంతో ఇల్లు కాలిపోయిన మద్దూర్ రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు హకీం, మండల అధ్యక్షుడు కిష్టయ్య, నర్సాపూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రియాజ్ అలీ, నాయకులు సత్యం, మెదక్ నియోజకవర్గ ఎన్ఎస్‌ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ మణిదీప్, నర్సాపూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సందీప్, హత్నూర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వరిగుంతం కృష్ణ, నర్సింలు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ ముదిరాజ్ సంఘం నూతన కేలండర్‌ను ఆదివారం బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్ ఆవిష్కరించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో బావిపీఠాధిపతి డాక్టర్ సిద్దేశ్వర్ ముదిరాజ్ సంఘం తాలుకా అధ్యక్షుడు నారాయణ, పట్టణ అధ్యక్షుడు బరూర్ దత్తాత్రి, నాయకులు సంగప్ప గోపాల్, శంకర్, శ్రీశైలం, అశోక్, విశ్వనాథ్, విఠల్, సత్యనారాయణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం



ప్రారంభిస్తున్న మొయినొద్దీన్

నారాయణఖేడ్: ఖేడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ముస్లిం యాక్షన్ కమిటీ కార్యాలయాన్ని ఆదివారం కమిటీ అధ్యక్షుడు మొయినొద్దీన్ ఖురేషి ప్రారంభించారు. ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు కార్యాలయం ఉపయోగపడుతుందని అన్నారు. మైనార్టీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడమే కమిటీ లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు అబ్దుల్ బాసిత్, మహ్మద్ దిల్‌దార్‌ఖాన్, ఎం.ఏ వహీద్ తాహెర్, యూసుఫ్ ఖురేషి, సుబూర్, హబీబ్‌అబ్దుల్లా, అబ్దుల్ ఖయ్యూం, దిన్దార్‌ఖాన్, సయ్యద్‌ఫయాజ్, హైదర్‌నవాబ్, ఫారూక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప మహా పడిపూజ



మహాపడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షాదారులు

నారాయణఖేడ్: ఖేడ్ శ్రీరామమందిర అయ్యప్ప స్వామి సన్నిధానంలో శనివారం రాత్రి అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఆయ్యప్పస్వామి మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఇరుముడి కార్యక్రమంతో పాటు అన్నవితరణ చేపట్టారు. అనంతరం దీక్షాదారులు శబరిమలైకు బయల్దేరి వెళ్లారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు 'కంటి వెలుగు'పై సమావేశం**

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమంపై సమావేశం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సంగ్రామ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు హాజరు కావాలని కోరారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మార్కెట్ ఏరియాలో వైద్యుడు అజయ్ ముజ్జ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 170 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. చర్మం, జుట్టు రాలడం, గోర్ల వ్యాధులతో బాధపడుతున్న పలువురికి సలహాలు అందించినట్లు వైద్యుడు పేర్కొన్నారు.

◆ **నేడు రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యే పూజలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

◆ **ఆర్థిక సాయం**

జిన్నారం(పటాన్‌చెరు): అన్నారం గ్రామానికి చెందిన వడ్డె రేణుక అనారోగ్యంతో మృతి చెందగా, మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. స్థానిక నాయకులు రుక్మారెడ్డి ఆదివారం మృతురాలి కుటుంబానికి సాయం అందించారు.

◆ **కేలండర్ ఆవిష్కరణ**

కొండాపూర్ (సంగారెడ్డి): నీలి కుల సంఘం జిల్లా నూతన కేలండర్‌ను ఆదివారం పట్టణంలోని కార్యాలయంలో అధ్యక్షులు నీలి అంజయ్య ఆవిష్కరించారు. సంఘం బలోపేతానికి కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుధీర్ కుమార్, కోశాధికారి సంగమేశ్వర్, సభ్యులు నర్సింహులు, చంద్రయ్య, ప్రవీణ్, శివరాజ్, నారాయణ మూర్తి, సుదర్శన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **వాలీబాల్ కిట్ అందజేత**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలోని క్రీడాకారులకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ఆదివారం వాలీబాల్ కిట్‌లను అందించారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు కావాల్సిన సహాయ సహకారాలను అందిస్తానని మధు తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి



విరాళం అందిస్తున్న గూడెం మధుసూదన్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకరిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌ని న్యూలైట్ చర్చి అభివృద్ధికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇచ్చిన రూ.15 లక్షల విరాళాన్ని ఆదివారం ఆయన చర్చి ప్రతినిధులకు అందించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధిలో నియోజకవర్గం ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. తెల్లాపూర్ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో మున్సిపల్ చైర్ పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి, రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మల్లెపల్లి సోమిరెడ్డి, టీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు దేవేంద్ర, నాయకులు సునీల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక ఉత్సవాలు



నీలం మధుతో నిర్వాహకులు

పటాన్‌చెరు టౌన్: జాతర, ఉత్సవాలు తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఆదివారం నిర్వహించిన మల్లికార్జున ఉత్సవాల్లో పాల్గొన్ని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. అనంతరం మధు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాగయ్య, శ్రీశైలం, పాండు, రమేష్ బాబు, శ్రీశైలం, రాజేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'భారీ' మనీ ప్లాంట్



కొబ్బరి చెట్టుకు అల్లుకున్న ప్లాంట్

ఝరాసంగం(జహీరాబాద్): ఒక్కసారి ఈ 'చిత్రాన్ని' చూడండి.. కొబ్బరి చెట్టుకు పాకుతూ పెరిగిన మనీ ప్లాంట్ ఆకులు కొబ్బరి ఆకులతో సమానంగా పెరిగి ఔరా అనిపిస్తోంది.. సాధారణంగా మన ఇళ్లల్లో పెరిగే మనీ ప్లాంట్ చెట్ల ఆకులు తమలపాకు అంత.. లేదంటే నీటి వసతి ఉన్న చోట కాస్త పెద్దవిగా కనిపిస్తాయి. కానీ ఝరాసంఘం మండలం బిడెకన్నె గ్రామంలో రాములు ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుకు అల్లుకున్న మనీ ప్లాంట్ ఆకులు అరటి ఆకుల అంత పెరిగి అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. నాలుగేళ్ల క్రితం ఈ మొక్కను నాటినట్లుగా రాములు తెలిపాడు.

అ'పూర్వ' సమ్మేళనం



మునిపల్లి(అందోల్): మండలంలోని పెద్దచల్మెడ జెడ్పీహెచ్‌ఎస్ 2002 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి మిత్రులను కలిసి, ఆప్యాయంగా పలకరించుకొని, అలనాటి జ్ఞాకాలను, మధురానుభూతులను పంచుకున్నారు.

◆ ◆ ◆



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1997 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులతో కలిసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు ఉషా, నాగభూషణం, అమీరుద్దీన్, సుబ్బారెడ్డి, ఇందిరా, మంజులవాణి, హెలినా, కిష్టయ్య, పూర్వ విద్యార్థులు వీరప్రసాద్, వెంకటేష్, సంగీత, చంద్రశేఖర్, శ్రీనివాస్, తిరుమల రావు, నరేందర్, జావిద్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- మునిగేపల్లిలో అస్తవ్యస్తంగా కరెంట్ తీగలు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు
- సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల డిమాండ్

కల్హేర్(నారాయణఖేడ్):

కొత్తగా ఏర్పాటైన నిజాంపేట మండలం మునిగేపల్లిలో కరెంట్ తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. గ్రామంలో త్రీఫేజ్ లైన్‌కు ఎక్కువగా విద్యుత్ వైర్లు ఉన్నాయి. 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌లో ఒకే చోట రెండు మూడు స్తంభాల చొప్పున మొత్తం 10 వరకు ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు ఉన్నాయి. కిందికి వేలాడుతున్న తీగలు ఇళ్లకు తాకుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎటు చూసిన విద్యుత్ వైర్లు ఉండడంతో ఫేజ్ ఎక్కడ ఉందో, న్యూట్రల్ లైన్ ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. మరోవైపు స్ట్రీట్ లైట్ దీపాలు పగలు వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. పాఠశాల వద్ద గతంలో వేసిన ఐరన్ విద్యుత్ స్తంభాలు వర్షాలకు తడిసి తుప్పుపట్టి పాడయ్యాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో సింగిల్ లైన్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు ప్రభుత్వం, ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

అధికారి వివరణ:

ఈ విషయంపై ఏఈ ట్రాన్స్‌కో నారాయణను వివరణ కోరగా.. మునిగేల్లిలో గ్రామంలో ఇరువైల వ్యవసాయ బోర్లు ఎక్కువగా ఉండంతో ఎల్‌టీ లైన్ వైర్లు పెరిగిపోయాయన్నారు. సింగిల్ లైన్ ఏర్పాటుపై ఉన్నాతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



మునిగేపల్లిలో ఓ వీధిలో కరెంట్ తీగలు

కిందకు వేలాడుతున్నాయి



విద్యుత్ వైర్లు పూర్తిగా కిందికి ఉన్నాయి. చాలా కాలంగా వేసిన వైర్లు తెగిపడుతున్నాయి. ఇళ్ల పైనుంచి కరెంట్ తీగలు వెళ్లడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతందోనని బయపడుతున్నాం.

– దుర్గయ్య, మునిగేపల్లి

సింగిల్ లైన్ ఏర్పాటు చేయాలి



గ్రామంలో కరెంట్ లైన్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లపై తాకుతున్నాయి. వైర్లు మొత్తం తొలగించాలి. దానికి బదులుగా సింగిల్ లైన్ వైర్లు ఏర్పాటు చేయాలి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– పర్వేజ్, మునిగేపల్లి